## హెచ్ఎం వెంకటేశ్వర్లుకు ఘనంగా సన్మానం

**గార్ల, జూన్ 30 (ప్రభాత గమనం) :**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల వ్యాప్త ప్రధానోపాధ్యాయుల (హెచ్ఎంల) సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నేడు పదవీ విరమణ పొందుతున్న గెజిటెడ్ హెడ్మాస్టర్ శీలంశెట్టి వెంకటేశ్వర్లను మండల విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మంకీడి వీరభద్రరావు ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం వెంకటేశ్వర్లను శాలువాతో సత్కరించి, మెమొంటో బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు గారు తన సుదీర్ఘ సర్వీసులో విద్యార్థుల భవిష్యత్తు కోసం, పాఠశాలల అభివృద్ధి కోసం అందించిన సేవలు ఆదర్శప్రాయమైనవని కొనియాడారు. ఆయన పదవీ విరమణ విద్యా రంగానికి తీరని లోటని, శేష జీవితాన్ని ఆయన ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు మాలోత్ శివ, విశ్రాంత హెచ్ఎం జె. నరసింహారావులు మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తోటి ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ మార్గదర్శిగా ఉంటూ, విద్యా ప్రమాణాల పెంపునకు ఆయన చేసిన కృషిని అభినందించారు.ఈ వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల వనరుల కేంద్రం సిబ్బంది (సిఆర్పిలు) మరియు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర్లు గారికి శుభాకాంక్షలు తెలిపారు.




## భవన నిర్మాణ కార్మికులకు 'ఇందిరమ్మ ఇండ్లు' ఇవ్వాలి

- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సీఐటీయూ కార్మికుల ధర్నా
- రూ.5 లక్షల బీమా, రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని వినతి

**గార్ల ,జూన్ 30 (ప్రభాత గమనం) :**

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందించే సాయం సంక్షేమం మాత్రమే కాదని, అది వారి హక్కు అని... అర్హులైన ప్రతి కార్మిక కుటుంబానికి 'ఇందిరమ్మ ఇండ్లు' కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్ & అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గార్ల ఎమ్మార్వో కార్యాలయం ఎదుట కార్మికులు భారీ ఆందోళన నిర్వహించారు. కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ శారదకు అందజేశారు.ఈ సందర్భంగా కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, అహర్నిశలు శ్రమించి దేశ నిర్మాణంలో భాగస్వాములవుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు తక్షణమే పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు.భవన నిర్మాణ కార్మికులందరికీ సొంతింటి కల నెరవేర్చేలా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి.ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు సంక్షేమ బోర్డు ద్వారా రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించాలి.60 ఏళ్లు దాటిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికి నెలకు రూ.5,000 జీవనభృతి (పెన్షన్) ఇవ్వాలి.ప్రస్తుతం సీఎస్‌సీ (CSC) ద్వారా కార్మికులకు నిర్వహిస్తున్న ఉచిత హెల్త్ టెస్టుల విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి.కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జడ శ్రీను, లాలు మేస్త్రి, సత్యం మేస్త్రి, సత్తి మేస్త్రి, బడుగుల వెంకన్న మేస్త్రి, మాధవరావు మేస్త్రి మరియు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.




## పెనుగొండ పాఠశాలలో సామాజిక తనిఖీ

**కేసముద్రం, జూన్ 30(ప్రభాత గమనం):**

పెనుగొండ ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన సూచనలు చేస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృంద సభ్యులు చింతల శ్రీనివాస్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## మహబూబాబాద్ జిల్లాలో సజావుగా 'సర్' ప్రక్రియ

- ప్రతీ ఒక్కరూ పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరీష్

**మహబూబాబాద్ జూన్ 30(ప్రభాత గమనం):**

జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలో 78 శాతం, మహబూబాబాద్ నియోజకవర్గంలో 78 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో రెండు నియోజకవర్గాల్లో వంద శాతం ఫారాల పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. ఫారాల పంపిణీ అనంతరం రెండో విడత బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేస్తామని, అన్ని బీఎల్ఓలు ఫారం-6 డిక్లరేషన్‌తో ఇంటింటికీ వెళ్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునాం అన్నారు. ఈ "ఎస్ ఐ ఆర్" సవరణ కార్యక్రమంలో డోర్నకల్ 267, మహబూబాబాద్ 288, మొత్తం 555 బిఎల్ఓ లు, సూపర్వైజర్స్ 56, ఏఈఆర్ఓ లు 12 మంది, ఈఆర్ఓ లు 2 మంది, జిల్లా వ్యాప్తంగా వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నామని, సర్వే కు వెళ్లే ముందు సిబ్బంది ఐడి కార్డు, క్యాప్, మెటీరియల్ తీసుకుని సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఆన్లైన్ లో ఎన్యూమరేషన్ ఫాం ఫిల్ చేయుటకు మరియు 2002 జాబితాలో పేరు కొరకు voters.eci.gov.in ని సంప్రదహించలని లేదా ఈసిఐఎన్ఈటి ఆప్ డౌన్లోడ్ చేసుకొని చూసుకోవచ్చు అని తెలిపారు.



## బయ్యారం పీఏసీఎస్ లో హరితహారం

- మొక్కలు నాటిన సొసైటీ చైర్మన్ మధూకర్ రెడ్డి
- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత :తహసీల్దార్ నాగరాజు

**బయ్యారం, జూన్ 30 (ప్రభాత గమనం) :**

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మూల మధుకర్ రెడ్డి, మండల తహసీల్దార్ నాగరాజు పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మధుకర్ రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, మండల వ్యవసాయ అధికారి రాజు కుమార్, సొసైటీ డైరెక్టర్లతో కలిసి కార్యాలయ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు."ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం పర్యావరణ సమతుల్యతకు ఎంతో దోహదపడుతుంది. కేవలం మొక్కలు నాటడంతోనే మన బాధ్యత ముగిసిపోదు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, వృక్షాలుగా మార్చినప్పుడే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని, ప్రాణవాయువును అందించగలం. ఈ మహత్తర యజ్ఞంలో రైతులు, ప్రజలు భాగస్వాములు కావాలి."తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకోవడం అందరి కర్తవ్యమని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు వేల్పుల శ్రీనువాస్, గంధంపల్లి సర్పంచ్ ప్రవీణ్ నాయక్, సొసైటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

## నర్సింహులగూడెంలో భగ్గుమన్న పాతకక్షలు

- బీజేపీ నేతపై దాడికి పాల్పడిన బీఆర్ఎస్ కార్యకర్త
- నెల్లికుదురు మండలంలో రాజకీయ ఉద్రిక్తత

**నెల్లికుదురు, జూన్ 30 (ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో బీజేపీ నాయకుడు జల్లె రమేష్‌పై జరిగిన దాడి స్థానికంగా రాజకీయ ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామంలో రాజకీయంగా ఇరు వర్గాల మధ్య గత కొంతకాలంగా నెలకొన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ కార్యకర్త బీజేపీ నేత రమేష్‌పై భౌతిక దాడికి పాల్పడగా, ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన జల్లె రమేష్‌ను స్థానికులు వెంటనే మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై బీజేపీ జిల్లా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను హింసాత్మక ఘటనలకు దారితీయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే, బాధితుడు దళిత వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో, సంబంధిత చట్టాల ప్రకారం కూడా కేసు నమోదు చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరుతున్నారు.



## రైతు భరోసా పడకపోతే ఏంచేయాలి?

- రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచనలు

**హైదరాబాద్ జూన్ 30(ప్రభాత గమనం):**

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన నేపథ్యంలో ఖాతాల్లో డబ్బులు జమ కాకపోతే రైతులు ముందుగా తమ పట్టాదారు పాస్‌బుక్, భూమి వివరాలు పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలో పేరు ఒకే విధంగా ఉందో లేదో నిర్ధారించుకోవాలి. అలాగే ఆధార్, మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా పరస్పరం అనుసంధానమై ఉన్నాయో లేదో కూడా తనిఖీ చేసుకోవాలి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నప్పటికీ నిధులు జమ కాకపోతే సంబంధిత మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని వ్యవసాయ శాఖ సూచించింది.

## లాకప్ డెత్ ఘటనపై తెలంగాణ పోలీసులకు నోటీసులు

**కోదాడ, జూన్ 30(ప్రభాత గమనం):**

సూర్యాపేట జిల్లా కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ కస్టడీలో మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై పూర్తి వివరాలతో మూడు వారాల్లో నివేదిక సమర్పించాలని జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించింది.తెలంగాణ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎన్‌హెచ్ఆర్సీ కేసును స్వీకరించింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, గత ఏడాది నవంబర్‌లో కర్ల రాజేష్‌ను పోలీసులు ఐదు రోజుల పాటు అక్రమంగా నిర్బంధించి, థర్డ్ డిగ్రీ చిత్రహింసలకు గురిచేసిన అనంతరం కస్టడీలో మరణించినట్లు ఆరోపణలు ఉన్నాయి.బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు విషయంలో ఫిర్యాదు చేసినందుకే రాజేష్‌ను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని, అనంతరం తీవ్రంగా హింసించి మరణానికి కారణమయ్యారని పేర్కొన్నారు. రాజేష్ తల్లి ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, సంబంధిత పోలీసులపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎన్‌హెచ్ఆర్సీ సూర్యాపేట జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. పోస్ట్‌మార్టం వీడియో, మేజిస్ట్రియల్ విచారణ నివేదిక, వైద్య రికార్డులు, కస్టడీకి సంబంధించిన అన్ని పత్రాలు, ఇతర సంబంధిత ఆధారాలను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ ఘటనలో వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకునే ఉద్దేశంతో ఎన్‌హెచ్ఆర్సీ ప్రత్యేక విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



## కేసముద్రం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ కు రీజన్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

**కేసముద్రం జూన్ 30(ప్రభాత గమనం):**

వరంగల్ నగరంలోని హంటర్ రోడ్డులోని గోల్డెన్ గార్డెన్స్ లో జూన్ 28 రాత్రి నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా 2025–26 లయనిస్టిక్ ఇయర్ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం అధ్యక్షుడు మామిడి అశోక్‌కు ప్రతిష్మాత్మక రీజన్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. ఈ అవార్డును జిల్లా గవర్నర్ డాక్టర్ కె. చంద్రశేఖర్ ఆర్య చేతుల మీదుగా అందుకున్నారు. 2025–26 లయనిస్టిక్ ఇయర్‌లో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు, సభ్యుల సమన్వయం, సేవా కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, ప్రజలకు అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడంలో సహకరించిన రీజినల్ చైర్మన్ (ఆర్సీ) దామెర సరేష్, జోన్ చైర్మన్ (జెడ్‌సీ) మాధవపెద్ది వెంకట్ రెడ్డి లకు మామిడి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం సభ్యులు, పెద్దలు, వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరి సహకారమే ఈ గుర్తింపుకు కారణమని పేర్కొంటూ వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జడ్సీ యర్నం శ్రీరాములు, దాసరి అశోక్, ఎన్.రమేష్ పాల్గొన్నారు.




## చంద్రు తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

**కేసముద్రం, జూన్ 30(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం చంద్రు తండా గ్రామపంచాయతీ పరిధిలో రూ.25.50 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న ఐదు సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ బానోత్ శ్రీను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా అన్ని అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374